
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 కర్ణాటక వార్తలు
మంగళవారం 2 ఏప్రిల్ 2024



ఉగాది కోసం ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

బెంగళూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): బెంగళూరుతో పాటు పరిసర ప్రాంతాల్లో నివసించే ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఉగాది పండుగకు సొంతూళ్లకు వెళ్లేందుకు ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసినట్లు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (ఏటీఎం) రవీంద్రారెడ్డి తెలిపారు. ఈనెల 5, 6వ తేదీలలో ప్రత్యేక బస్సులు నడుపుతామని ఆయన సోమవారం ఒక ప్రకటలో పేర్కొన్నారు. సాధారణ చార్జీలతోనే ప్రత్యేక సర్వీసుల్లో ప్రయాణించవచ్చన్నారు. విజయవాడ, నెల్లూరు, కర్నూలు, కడప, ప్రొద్దుటూరు, అనంతపురం, చిత్తూరు, తిరుపతితో పాటు రాష్ట్ర పరిధిలోని అన్ని ప్రధాన నగరాలకు బస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు.



విరివిగా బోరుబావులు

ఐటీ నగరికి రూ 42 కోట్ల మంజూరు

313 బోర్ల తవ్వకానికి అనుమతి

- తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు
- పలుచోట్ల మూతపడిన వాటర్ ప్లాంట్లు

బెంగళూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర వ్యాప్తంగా నీటి సమస్య తీవ్రమవుతున్న తరుణంలో అత్యవసరంగా బోరుబావుల తవ్వకానికి బీబీఎంపీ, జల మండలి సిద్ధమయ్యాయి. బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ) ద్వారా 113, జలమండలి ద్వారా 200 బోరుబావుల తవ్వకానికి నిర్ణయించారు. ఎండవేడిమి పెరుగుతుండడంతో నగర వ్యాప్తంగా ఉండే చెరువులలో నీటిమట్టం తగ్గిపోతోంది. మరికొన్ని చెరువులు ఇప్పటికే పూర్తిగా ఎండిపోయాయి. సంస్కరించిన నీటిని చెరువులకు మళ్లించే ప్రక్రియ కొనసాగుతోంది. నగర వ్యాప్తంగా 60-70 శాతం బోరుబావులు పనిచేయకపోవడంతో కొత్త బోరుబావుల తవ్వకం అనివార్యమవుతోంది. ప్రస్తుతం నగర పరిధిలో జలమండలి ఆధ్వర్యంలో 11,816 బోరుబావులు ఉన్నాయి. వీటిలో దాదాపు వెయ్యి బోర్లలో నీటి మట్టం తగ్గింది. మరో 1240 బోరుబావులు చాలాకాలంగా ఉపయోగించడం లేదు. ఉన్న బోరుబావులలోనే నీటి మట్టం తగ్గుతుండడంతో కొత్తగా సమీప ప్రాంతాల్లో కాకుండా దూరంగా బోర్లు వేయాలని నిర్ణయించారు. బోరుబావుల తవ్వకానికి రూ. 31 కోట్లు రిజర్వ్ చేసి టెండర్లు ఆహ్వానించారు. బీబీఎంపీ రూ.11కోట్లు బోరుబావుల తవ్వకానికి కేటాయించింది. ఇలా జలమండలి, బీబీఎంపీ సంయుక్తంగా రూ.42కోట్లతో 313 బోరుబావులను తవ్వేందుకు సిద్ధమయ్యాయి. నగర వ్యాప్తంగా నిర్మాణాలు కుంటుపడకుండా ప్రత్యామ్నాయ విధానాన్ని సిద్ధం చేశారు. నిర్మాణాలకు సంస్కరించిన నీటిని ఉపయోగించాలని తీర్మానించారు. అపార్ట్‌మెంట్ ఫెడరేషన్, క్రెడాయ్ సంయుక్తంగా ఈ నిర్ణయాన్ని తీసుకున్నాయని జలమండలి చైర్మన్ డాక్టర్ రామప్రసాత్ మనోహర్ తెలిపారు. అపార్ట్‌మెంట్ల నుంచి సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ)లకు 50 శాతం నీటిని విక్రయించదలిచారు. ఇప్పటికే అనుమతులు ఇచ్చారు. జలమండలి ఆధ్వర్యంలోని ఎస్‌టీపీల ద్వారా సంస్కరించిన నీటిని ప్రత్యామ్నాయాలకు కేటాయిస్తారు. ప్రైవేట్ అపార్ట్‌మెంట్ల నుంచి జలమండలి ద్వారా 500 మీటర్ల దూరం దాకా పైప్‌లైన్ ఏర్పాటు చేసి సంస్కరించదలిచారు. సాధారణంగా భారీ భవనాల నిర్మాణాలకు అవసరమైన నీటిని బోరుబావులు లేదా ట్యాంకర్ల ద్వారా సమకూర్చుకుంటారు. తద్వారా భూగర్భజలంపై ఒత్తిడి పెరుగుతుంది. ఇప్పటికే 68 లక్షల లీటర్ల మేరకు సంస్కరించిన నీటికి డిమాండ్ ఉంది. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. తొలిదశలో ఎస్‌టీపీల నుంచి 5 కిలోమీటర్ల పరిధికి ప్రత్యేక పైప్‌లైన్, ట్యాంకర్ల ద్వారా సంస్కరించిన నీటిని సరఫరా చేయదలిచారు. అంతకుమించి అవసరమైతే ప్రత్యామ్నా ఏర్పాట్లు చేయదలిచారు.

మూతపడిన ఆర్‌ఓ ప్లాంట్లు

నగరవ్యాప్తంగా తాగునీటికి డిమాండ్ పెరుగుతోంది. ఆర్‌ఓ ప్లాంట్ల వద్ద జనం గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్‌ఓ ప్లాంట్లకు అవసరమైన మేర నీరు లేకపోవడంతో ఇప్పటికే 200కు పైగా మూతపడ్డాయి. తిరిగి వాటిని అందుబాటులోకి తెచ్చేందుకు జలమండలి ప్రయత్నిస్తోంది. నగర వ్యాప్తంగా ఆర్‌ఓ ప్లాంట్ల వద్ద రూ.5 కాయిన్ వేస్తే 20 లీటర్ల నీరు వచ్చేది. ఇటీవల 19 లీటర్లకే పరిమితమైంది. ప్రాంతాలవారీగా ఆర్‌ఓ ప్లాంట్లు క్రమేపీమూతపడ్డంతో పనిచేస్తున్న ప్లాంట్ల వద్ద రాత్రింబవళ్లు సందడి నెలకొంది. దీనికి తోడు కొన్ని ఆర్‌ఓ ప్లాంట్లు ఉదయం, మధ్యాహ్నం మాత్రమే పనిచేస్తున్నాయి. ఆర్‌ఓ ప్లాంట్‌కు అనుబంధమైన బోరుబావి నీటి సామర్థ్యాన్ని బట్టి వాటిని ఉపయోగిస్తున్నారు. బీబీఎంపీ పరిధిలో తూర్పు డివిజన్‌లో 54 ప్లాంట్లు మూతపడగా దక్షిణలో 58, పశ్చిమలో 54, ఆర్‌ఆర్ నగర్‌లో 31, బొమ్మనహళ్లి 9, దాసరహళ్లి 6, యలహంక 5, మహదేవపురలో 2 ప్లాంట్లు మూతపడ్డాయి. ఎన్నికల ప్రచారానికి వెళ్లే సందర్భంలోనూ ప్రజలు నీటి కోసం డిమాండ్ చేస్తున్నారు.



మన్సూర్ అలీఖాన్

- 15 ఏళ్లుగా రాష్ట్రం నుంచి లోక్‌సభకు దూరం
- ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ఏకైక అభ్యర్థి పోటీ

ముస్లింలకు దక్కని ప్రాతినిధ్యం

బెంగళూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గడిచిన 15 సంవత్సరాల్లో రాష్ట్రం నుంచి ఒక్క ముస్లిం అభ్యర్థి కూడా లోక్‌సభ ఎన్నికల్లో గెలవలేదు. రాష్ట్రంలో 12 శాతం మంది జనాభా కల్గి ఉండగా మూడుసార్లు జరిగిన ఎన్నికల్లో ఒక్కరు కూడా గెలుపొందలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ బెంగళూరు సెంట్రల్ నుంచి మన్సూర్ అలిఖాన్‌కు టిక్కెట్ కేటాయించింది. 2004 ఎన్నికల్లో కలబురగి నుంచి ఇక్బాల్ అహ్మద్ గెలుపొందారు. ఆ తర్వాత వరుసగా జరిగిన మూడు ఎన్నికల్లోనూ ఎవరూ గెలుపొందలేకపోయారు. రాష్ట్రంలో ప్రధానమైన రాజకీయ పార్టీల్లో కాంగ్రెస్, బీజేపీ, జేడీఎస్ ఉన్నాయి. మూడు పార్టీలు టిక్కెట్ల కేటాయింపులోనూ ప్రాధాన్యత ఇవ్వలేదు. గడిచిన నాలుగు ఎన్నికలను పరిశీలిస్తే మూడు పార్టీలు కలిపి 11 మందికి అవకాశం ఇచ్చాయి. 2004లో నలుగురు అభ్యర్థులు కాగా, 2009, 2014లో ముగ్గురు ముస్లిం అభ్యర్థులు, 2019 ఎన్నికల్లో కేవలం ఒకరు మాత్రమే పోటీ చేశారు. నాలుగు ఎన్నికల్లోనూ బీజేపీ ఎవరికీ టిక్కెట్ ఇవ్వలేదు. 1989లో ధారవాడ నుంచి బీఎం ముజాహిద్, బెంగళూరు ఉత్తర నుంచి జాఫర్‌షరీఫ్ గెలుపొందారు. ఆ తర్వాత 2004 వరకు జరిగిన ఐదు ఎన్నికల్లో మూడుసార్లు షరీఫ్ గెలుపొందారు. ఖమరుల్ ఇస్లాం, సరళగి చెరోసారి గెలుపొందారు. 2019 ఎన్నికల్లో బెంగళూరు సెంట్రల్ నుంచి రిజ్వాన్ అర్షద్ పోటీ చేసి ఓడిపోయారు. ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి మన్సూర్ అలీఖాన్ అభ్యర్థి అయ్యారు. బెంగళూరు సెంట్రల్ ద్వారా మన్సూర్ అలీఖాన్ గెలుపొందితే దశాబ్దన్నర రికార్డు మార్పు కానుంది.

సిద్ధగంగ మఠంలో విశేష పూజలు

బెంగళూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తుమకూరు సిద్ధగంగ మఠంలో డాక్టర్ శివకుమారస్వామిజీ 117వ జయంతిని పురస్కరించుకుని సోమవారం విశేష పూజలు, ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. గోసల సిద్ధేశ్వర వేదికపై కార్యక్రమానికి మఠాధిపతి సిద్ధలింగస్వామిజీ, సుత్తూరు మఠాధిపతులు సాన్నిధ్యం వహించారు. తొలుత స్వామిజీ సమాధికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిజీ విగ్రహాన్ని సమాధి నుంచి వస్తు ప్రదర్శనశాల వరకు ఊరేగించారు. హోంశాఖ మంత్రి డాక్టర్ జి. పరమేశ్వర్, బెంగళూరు గ్రామీణ బీజేపీ అభ్యర్థి డాక్టర్ సీఎన్ మంజునాథ్, తుమకూరు కాంగ్రెస్ అభ్యర్థి ముద్దహనుమేగౌడ, వి. సోమణ్ణ తదితరులు మఠాన్ని సందర్శించి స్వామిజీ ఆశీస్సులు పొందారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు రావడంతో వారి వెంట అభిమానులు, పార్టీ నాయకులు కూడా పెద్దసంఖ్యలో ఉన్నారు.




స్వామిజీ విగ్రహం ఊరేగింపు

నేను సీఎంగా ఉండాలంటే..

వరుణలో 60వేల మెజారిటీ రావాలి

- ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మైసూరు జిల్లాలో మూడు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం ముఖ్యమంత్రి సిద్దరామయ్య బిళిగెరెలో కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. వరుణ తన అదృష్ట నియోజకవర్గమని, తాను రెండుసార్లు సీఎం కావడానికి ప్రజల ఆశీస్సులే కారణమని అన్నారు. ప్రస్తుతం తాను సీఎంగా కొనసాగాలంటే చామరాజనగర లోక్‌సభ అభ్యర్థిగా బరిలో ఉన్న సునిల్‌బోస్‌ను తప్పక గెలిపించాలని, వరుణ పరిధిలో కనీసం 60వేల మెజారిటీ రావాలని కోరారు. తాము అమలు చేస్తున్న ఐదు గ్యారెంటీ పథకాలతో అన్ని వర్గాల ప్రజలు ప్రయోజనం పొందుతున్నారని తెలిపారు. అంతకుముందు టి. నరసీపుర బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ దేశ ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. ప్రధాని మోదీ పదేళ్లలో ప్రజలకు ఏం చేశారో బహిరంగంగా చెప్పాలని డిమాండ్ చేశారు. విదేశాల నుంచి నల్లధనం రాలేదని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పించలేదని, రైతుల ఆదాయం పెరగలేదని తెలిపారు. కానీ 8నెలల క్రితం శాసనసభ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఐదు గ్యారెంటీలు రాష్ట్రమంతటా అమలు చేస్తున్నామన్నారు. చామరాజనగర రిజర్వ్ నియోజకవర్గం నుంచి మంత్రి మహదేవప్ప కుమారుడు సునిల్‌బోస్ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచాడు. ఆయనకు మద్దతుగా స్వయంగా సీఎం ప్రచారం చేస్తున్నారు. ఆశ్రయ సమితి చైర్మన్ యతీంద్ర సిద్దరామయ్య, గ్యారెంటీ అమలు కమిటీ వైస్‌చైర్మన్ పుష్పాఅమరనాథ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.



సమావేశాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య



రంజాన్ వేళలు

ఇఫ్తార్	: మంగళవారం సాయంత్రం 6:33
సెహరి	: బుధవారం ఉదయం 04:59

పోటాపోటీగా నామినేషన్లు

- 49 మంది.. 55 సెట్ల దాఖలు
- పాల్గొన్న పార్టీల ముఖ్యనేతలు



బెంగళూరు సెంట్రల్ బీజేపీ అభ్యర్థి పీసీ మోహన్

బెంగళూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల తొలి విడతలో భాగంగా సోమవారం పోటాపోటీగా నామినేషన్లు దాఖలయ్యాయి. బీజేపీ-జేడీఎస్ నుంచి బెంగళూరు సెంట్రల్ అభ్యర్థి పీసీ మోహన్, మైసూరు అభ్యర్థి యదువీర్, తుమకూరు నుంచి సోమణ్ణ, చిక్కబళ్లాపుర నుంచి సుధాకర్, కోలారు నుంచి మల్లేశ్‌బాబు నామినేషన్లు వేశారు. బెంగళూరు సెంట్రల్ పీసీ మోహన్ వెంట యడియూరప్ప, ప్రతిపక్షనేత అశోక్, అరవింద లింబావళి, గాలి జనార్దనరెడ్డి ఉన్నారు. బెంగళూరు దక్షిణ కాంగ్రెస్ అభ్యర్థి సౌమ్యరెడ్డి నామినేషన్‌లో ఎమ్మెల్యే కృష్ణప్ప, ఎమ్మెల్సీ యూబీ వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యే ఆర్‌పీ దేవరాజ్ పాల్గొన్నారు. నామినేషన్ల అనంతరం ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ర్యాలీలో మాట్లాడుతూ సౌమ్యరెడ్డి శాసనసభ ఎన్నికల్లో ఓడిపోలేదని, అధికారులే ఓడించారని ఆరోపించారు. ఆ తర్వాత కొందరు అధికారులు మంత్రి రామలింగారెడ్డి వద్ద క్షమాపణ కోరారని పేర్కొన్నారు. సౌమ్యరెడ్డి తన కుమార్తె లాంటిదని అన్నారు. లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. మండ్య కాంగ్రెస్ అభ్యర్థి స్టార్ చంద్రు అలియాస్ వెంకటరామగౌడ నామినేషన్‌లో డీసీఎం డీకే శివకుమార్, మంత్రి చలువరాయస్వామి తదితరులు పాల్గొన్నారు. మైసూరు బీజేపీ-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థి యదువీర్ కృష్ణదత్త ఒడయార్ నామినేషన్‌లో రాజమాత ప్రమోదాదేవి ఒడయార్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. తుమకూరులో బీజేపీ అభ్యర్థి సోమణ్ణ నామినేషన్‌లో ఎమ్మెల్యేలు సురేశ్‌బాబు, జ్యోతిగణేశ్, సురేశ్‌గౌడ, మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు. చిక్కబళ్లాపుర బీజేపీ అభ్యర్థి డాక్టర్ సుధాకర్ నామినేషన్ వేళ మాజీ మంత్రి ఎంటీబీ నాగరాజ్‌కు పాదాభివందనం చేశారు. దొడ్డబళ్లాపుర ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజు, మాజీ ఎమ్మెల్యే వర్తూరు ప్రకాశ్, నిసర్గ నారాయణస్వామి పాల్గొన్నారు.

49 మంది నామినేషన్ల దాఖలు

తొలివిడతలో భాగంగా 14 లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో సోమవారం 49 మంది నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తం 55 సెట్ల నామినేషన్లు వేసినట్టు అధికారులు తెలిపారు. 46 మంది పురుషులు, ముగ్గురు మహిళలు నామినేషన్లు దాఖలు చేశారు. బెంగళూరు దక్షిణ, దక్షిణకన్నడ, చిత్రదుర్గ నుంచి మహిళలు నామినేషన్లు వేయగా 14 నియోజకవర్గాల్లోనూ 46 మంది నామినేషన్ వేశారు. అత్యధికంగా మండ్య, చిక్కబళ్లాపురలో ఏడుగురు చొప్పున, బెంగళూరు గ్రామీణలో ఐదుగురు, మైసూరు, చామరాజనగర, బెంగళూరు సెంట్రల్, బెంగళూరు దక్షిణలో నలుగురు చొప్పున నామినేషన్లు వేశారు. చిక్కమగళూరు, చిత్రదుర్గ, తుమకూరు, కోలారు నుంచి ఇద్దరు చొప్పున, హాసన్, దక్షిణకన్నడ, బెంగళూరు ఉత్తర నుంచి ఒక్కొక్కరు నామినేషన్ వేశారు.



బెంగళూరు దక్షిణ కాంగ్రెస్ అభ్యర్థి సౌమ్యరెడ్డి

కోలాహలంగా తీర్థవాది



గరుడ పతాకాన్ని అవరోహణం గావిస్తున్న అర్చకులు



ఖాద్రీశుడికి తీర్థవాది నిర్వహిస్తున్న అర్చకులు

కదిరి, ఏప్రిల్ 1: శ్రీసత్యసాయి జిల్లా కదిరి ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం తీర్థవాది కోలాహలంగా సాగింది. ఉదయం నిత్యపూజ, హోమం, అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారు ఆలయ ప్రాంగణంలో కొలువుదీరారు. బ్రహ్మోత్సవాల్లో సేవలు అందించిన వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది, ఆలయ అర్చకులు, అధికారులు, సిబ్బంది, భక్తులు శ్రీవారి వెంట నడుస్తూ రంగులు చల్లుకుని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం అమ్మవార్లు, శ్రీవారిని ఆలయ పడమటి దిక్కున ఉన్న భృగుతీర్థం వద్దకు చేర్చి, అభిషేకాలు నిర్వహించారు. భక్తుల గోవిందనామ స్మరణ మధ్య శ్రీచక్రస్నానం ఘనంగా ముగిసింది. భక్తులు కోనేటిలో స్నానం చేశారు. అనంతరం శ్రీవారు తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. యాగశాలలో హోమం అనంతరం శ్రీవారు ఆలయ ప్రవేశం గావించారు. ఉత్సవాల్లో కల్యాణోత్సవం రోజున ధ్వజస్తంభానికి ఆరోహణం చేసి, గరుడ పతాకాన్ని ఈ సందర్భంగా అవరోహణం గావించారు. శ్రీవారి ఆలయ ప్రవేశంతో ప్రధాన ద్వారాలను మూసివేశారు. సోమవారం అన్నిరకాల దర్శనాలను రద్దు చేశారు.

తీర్థవాదికి కుంకుమ, గాజులు ప్రత్యేకం

కదిరి నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో కదిరి కుంకుమ, గాజులకు ప్రత్యేకత ఉంది. తీర్థవాది రోజున తిరువీధుల్లో అమ్మే కుంకుమ, గాజులను కదిరి ప్రాంతంలోని అడపడుచులందరూ కొనుగోలు చేస్తారు. కుంకుమను కొనుగోలు చేసి సంవత్సరం వరకు దీనిని వాడుకుంటారు. ఇళ్లకు వచ్చిన అడపడుచులకు గాజులు, కుంకుమతో పాటు కదిరి మల్లెలు ఇవ్వడం ఇక్కడి ఆనవాయితీ. పెద్దఎత్తున వీటిని కొనుగోలు చేస్తారు.

నేడు పుష్పయాగోత్సవం

శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో మంగళవారం పుష్పయాగోత్సవం నిర్వహించనున్నారు. ఈ ఉత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. శ్రీవారికి అన్ని రకాలు పుష్పాలు, సుగంధ ద్రవ్యాలతో యాగోత్సవం నిర్వహిస్తారు.



శ్రీవారికి అభిషేకం



శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారికి చందనాభిషేకం



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,580.50	1,585.38
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	926	5,593
సామర్థ్యం (టీఎంసీలు)	4.72	7.58

జాతీయ పారా స్విమ్మింగ్ పోటీల్లో జిల్లాకు ఐదు స్వర్ణాలు



పతకాలు సాధించిన క్రీడాకారులు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 1: జాతీయ పారా స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో బళ్లారి జిల్లా 5 బంగారు, 2రజిత, 3 కాంస్య పతకాలను గెలుచుకుంది. మార్చి 29 నుంచి 31వరకు మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లోని అటల్ బిహారీ వాజ్‌పేయ్ ట్రైనింగ్ సెంటర్‌లో జరిగిన ఈ పోటీల్లో బళ్లారి జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈత గాళ్ళు గోపీచంద్, యోజిత్, సాయి బేబీ, సాయినిఖిల్, కె.కవిత పాల్గొన్నారు. స్విమ్మింగ్ పోటీల్లో గోపిచంద్ మూడు బంగారు పతకాలను, యోజిత్ స్వర్ణరజిత పతకాలను, సాయిబేబి కాంస్యపతకాన్ని, సాయినిఖిల్ స్వర్ణ కాంస్య పతకాలను, కవిత రజత పతకాన్ని సాధించారు. పోటీదారులు రజనీ లక్క, స్వామి, శరత్ గైక్వాడ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందారు. ఈఘనత సాధించిన స్విమ్మర్లను జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జిల్లాపోలీసు సూపరింటెండెంట్ రంజిత్ కుమార్ బండారు, జిల్లా పంచాయితీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాహుల్ శరణప్ప, అదనపు జిల్లాకలెక్టర్ మహ్మద్ జుబేరా, యువజన సాధికార క్రీడాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గ్రేసి అభినందించారు.

ప్రతి ఒక్కరూ ప్రకృతిని కాపాడాలి



నీటి తొట్టెలను పంపిణీ చేస్తున్న దృశ్యం

బళ్లారి సిటీ, ఏప్రిల్ 1: 'మీకోసం మేము' సంస్థ వేసవిలో తాపాన్ని అనుభవిస్తున్న పశుపక్ష్యాదుల కోసం ధాన్యపు, నీటి తొట్టిలను పంపిణీ చేపట్టిందని ఆ సంస్థ అధ్యక్షుడు వినయ్ కుమార్ తెలిపారు. సూర్య తాపం నుంచి సహజీవులను సంరక్షించే పని ప్రతి ఒక్కరూ చేయాలన్నారు. సంస్థ కార్యనిర్వహణాధికారి నాగరాజ్ మాట్లాడుతూ ఈ గిన్నెలు(తొట్టీలు)పంపిణీ ఏప్రిల్ నెలలో పూర్తవుతుందని, ఆసక్తిగలిగిన వారు సంస్థ మొబైల్ నం 9448584400ను సంప్రదించాలని కోరారు. ఈసందర్భంగా సంస్థ సభ్యులు నందీశ్, వీరేశ్, బాలసుబ్రమాణ్యం, అనిల్ ,నాగరాజు, సూరజ్, కేదార్‌నాథ్, రాజశేఖర్‌స్వామి, భాష, తిప్పేశ్, పృథ్వి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం



నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 1: లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలకోడ్ అమల్లో ఉన్నందున ఆదివారం అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశారు. సండూర్ తాలూకా బన్నిహట్టి గ్రామం నుంచి లింగదహళ్ళి గ్రామానికి వెళ్ళే రోడ్డులో బ్లాక్ హోండా ద్విచక్రవాహనంలో అతడుసుమారు 8640 లీటర్ల మద్యం తరలిస్తున్నట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎన్.మంజునాథ్ తెలిపారు.



తాగునీటి సమస్యల పరిష్కారానికి

డయల్ 1077

● కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 1: వేసవిలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వేసవిని ఎదుర్కొనేందుకు బళ్లారి జిల్లా యంత్రాంగం వినూత్న ప్రయత్నం చేసింది. తాగు నీటి సమస్య పరిష్కారం కోసం 1077 నెంబరుతో హెల్ప్‌లైన్ ఏర్పాటుచేసింది. ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా మాట్లాడుతూ, ఈ నెంబరుకు కాల్ రాగానే ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

బళ్లారిలో దశాబ్దకాలంగా తాగునీటి సమస్య నెలకొంది. మరీ ముఖ్యంగా ఈ ఏడాది వర్షాలు కురవక జిల్లా కరువును ఎదుర్కొంటోంది. ఈసారి వేసవి ప్రారంభం కాకముందే ఉష్ణోగ్రతలు పెరిగాయి. వర్షాల్లేక బోరు బావులు ఎండిపోతున్నాయి. తాగునీటి చెరువులన్నీ ఖాళీ అవుతున్నాయి. దీంతో పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీవ్రమైంది. తాగునీరు తెచ్చుకోవడం ప్రజలకు సవాల్‌గా మారింది. ఈ నేపథ్యంలో ఈ హెల్ప్‌లైన్‌ను ఏర్పాటుచేశారు.

హెల్ప్‌లైన్ ప్రయోజనం ఏమిటి?

జిల్లాలో తాగునీరు, పశువుల మేత తదితర సమస్యలపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన 1077 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఎవరైనా కాల్‌చేసి తమ సమస్యను చెప్పుకోవచ్చు. ఈ నంబర్‌కు కాల్ చేసే వ్యక్తులు సమస్యలతో పాటు చిరునామా, పేరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. దీనిపై వెంటనే యంత్రాంగం స్పందించి చర్యలు తీసుకుంటుంది.

బీజేపీ అభ్యర్థి అబద్ధాలను ప్రజలు నమ్మరు: మంత్రి నాగేంద్ర

బళ్లారి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీరాములు చెప్పే అబద్ధాలను జనం నమ్మరని, ఎంపీ ఎన్నికల్లో ప్రజలు తిరిగి ఆయన్ను ఓడిస్తారని బళ్లారి ఇన్‌చార్జి మంత్రి నాగేంద్ర పేర్కొన్నారు. బీజేపీ నాయకులు జిమ్మికులు చేసి గెలిచే రోజులు పోయాయని అన్నారు. ప్రజల ఆశీస్సులతో కాంగ్రెస్ ఎంపీగా తుకారాం ను గెలిపించుకుంటామని నాగేంద్ర ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న పథకాల వల్ల రాష్ట్రంలో నిరుపేదలంతా కడుపు నిండా భోజనం చేస్తున్నారని, కాబట్టి కాంగ్రెస్‌ను ప్రజలు దీవిస్తారని పేర్కొన్నారు. తుకారాం మాట్లాడుతూ 2008 నుంచి ఎమ్మెల్యేగా గెలిచానని, ప్రజలకు తాను ఎప్పుడూ అండగా ఉంటానన్నారు. విలేకరుల సమావేశంలో వీరితో పాటు కాంగ్రెస్ నాయకులు మించు శ్రీనివాసులు, సుబ్బరాయుడు, విక్కీ, గుమ్మనూరు జగన్, రామాంజినేయులు, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి, ఇతర కాంగ్రెస్ నాయకులు

తుకారామ్ గెలుపు ఖాయం

బళ్లారిరూరల్, ఏప్రిల్ 1 : మే 7వ తేదీన జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి తుకారామ్ గెలుపు ఖాయమని బళ్లారి ఇన్‌ఛార్జ్ మంత్రి నాగేంద్ర తెలిపారు. తాలుకాలోని మోకా గ్రామ హనీ ఫంక్షన్ హాలులో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యకర్తలు, నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోక్‌సభ అభ్యర్థికి అత్యధిక మెజార్టీ తీసుకువస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఐదు గ్యారెంటీల వల్లే తమకు ఖచ్చితమైన గెలుపు వస్తుందని, మహిళలకు ఉచిత బస్సు పాస్, ప్రతి నెల ఉచిత పింఛన్, రేషన్, ఉచిత కరెంటు బిల్లులు, తదితర ఐదు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. తుకారామ్ మాట్లాడుతూ 2008 నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి తమ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని, అదేవిధంగా అధిష్టానం సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ల ఆదేశాలతో బళ్లారి జిల్లా లోక్‌సభ అభ్యర్థిగా బరిలో దిగానని, అందరూ తనను ఆదరించాలని కోరారు. అదేవిధంగా సిటీ ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి, కంప్లి ఎమ్మెల్యే జేఎన్ గణేష్‌లు మాట్లాడుతూ బళ్లారి నగరంలో కాంగ్రెస్ పార్టీకి మరింత అత్యధిక మెజార్టీ తీసుకువస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మహానగరపాలిక మేయర్ శ్వేత, కార్పొరేటర్లు విక్కి, మించు శ్రీనివాస్, బీఆర్ఎల్ శీన, కవితావన్నప్ప, మోకా గ్రామ పంచాయతీ అధ్యక్షులు పత్తారు వెంకటేష్, ఫోటో రామన్న, అన్నా నాగరాజు, మానయ్య, ముండ్రిగి నాగరాజు పాల్గొన్నారు.

బీజేపీ ఒక అబద్ధాల పుట్ట : మంత్రి శివరాజ్ తంగడిగి

సిరుగుప్ప, ఏప్రిల్ 1 : బీజేపీ అబద్ధాల పుట్ట అని కొప్పాళ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శివరాజ్ తంగడిగి ఎద్దేవా చేశారు. సిరుగుప్ప పట్టణంలోని కమ్మ కళ్యాణ మండపంలో లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని సోమవారం కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని మంత్రి శివరాజ్ తంగడిగి ప్రారంభించి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ పరిపాలనలో వున్న బీజేపీ ప్రజలకు అబద్దాలు ప్రచారాలు చేస్తోందని ఆయన దుయ్యబట్టారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేద ప్రజల కోసం ఐదు గ్యారెంటీ పథకాలు సక్రమంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.

లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రాజశేఖర్ ఇత్నాల్‌ను 50 వేల మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రాజశేఖర్ ఇత్నాల్ మాట్లాడుతూ ప్రజలు ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సిరుగుప్ప ఎమ్మెల్యే బీఎం నాగరాజు మాట్లాడుతూ లోక్‌సభ అభ్యర్థి గెలిస్తే తాలుకా అభివృద్ధికి మరింత కృషి చేయవచ్చునని తెలిపారు. బళ్లారి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు శివయోగి, తాలుకా అధ్యక్షులు కరిబసప్ప, ప్రముఖ నాయకులు కోటిరెడ్డి, గోపాల్‌రెడ్డి, పవన్ కుమార్ దేశాయ్, ఉమేష, సీనియర్ నాయకులు బీఎం సతీష్, వెంకటేష్, కౌన్సిలర్ బీఎం అప్పాజీ నాయక, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొప్పాళ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రాజశేఖర్ ఇత్నాల్‌ను గెలిపించాలని విజ్ఞప్తి

నష్టాల బాటలో క్యాబేజీ రైతు

20 కిలోల బ్యాగు రూ.200 పలుకుతున్న వైనం

కంప్లి, ఏప్రిల్ 1 : రబీ సీజన్‌లో రైతులు బోర్ల కింద కాస్తో కూస్తో ఆరుతడి పంటలు వేస్తున్నారు. వేసుకున్న పంటలకు కూడా సరియైన గిట్టుబాటు ధరలు లేక నష్టపోయారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ యేడాది రబీ పంటలో కాలువలకు నీరు లేకపోవడంతో ఎక్కడ చూసినా భూములు ఖాళీగానే వుండిపోయాయి. అలాగే బోర్లు కూడా నీరు లేక ఖాళీగా వుండిపోయాయి. కానీ కాస్తో కూస్తో వుండే నీటితో ప్రొద్దుతిరుగుడు, వంకాయ, బీరకాయ, టమోటా, క్యాబేజీ పంటలు వేసుకుంటున్నారు. కానీ వేసుకున్న పంటలకు కూడా మార్కెట్లో ధరలు లేక పెట్టిన పెట్టుబడులు రాక ఇబ్బందులు ఎదురయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముద్దాపురం గ్రామానికి చెందిన రైతు పెద్దన్న తన పొలంలో క్యాబేజీ పంటను నాటాడు. సుమారు రూ. 80 వేలు పెట్టుబడి పెట్టాడు. తీరా పంటచేతికొచ్చి మార్కెట్‌కు పంపించే తరుణంలో మార్కెట్లో ధర లేకుండా పోయింది. దీంతో పెట్టిన పెట్టుబడులు కూడా రాకుండా పోయాయని ఆవేదనవ్యక్తం చేస్తున్నాడు. ఒక్కో బ్యాగు కేవలం రూ. 200లు పలుకుతోందని, ఒకొక్క బ్యాగులో సుమారు 20 క్యాబేజీ పడుతుందన్నారు. గతంలో క్యాబేజీ రేట్లు రూ. 30 నుంచి రూ. 50 వరకు వుండేది. బోర్లలో నీటి సమస్య వున్నప్పటికీ వున్న నీటితోనే పండించిన పంటలకు ధరలు లేకుండా పోయాయని రైతులు వాపోతున్నారు. మధ్యవర్తులు కొద్దిమేర లాభపడుతున్నప్పటికీ రైతులకు మాత్రం పంటలు నష్టాలనే మిగిల్చాయన్నారు.



తాను పండించిన క్యాబేజీ పంటను చూపుతున్న రైతు పెద్దన్న

ప్రజాప్రతినిధిగా సేవచేసే అవకాశం కల్పించండి : కుమార్‌నాయక్

రాయచూరు, ఏప్రిల్ 1 : రాయచూరు లోక్‌సభ పరిధిలోని ప్రజలకు ప్రతినిధిగా సేవలందించే అవకాశం తనకు కల్పించాలని తనను ఎన్నికల్లో ఆశీర్వదించాలని కాంగ్రెస్ తరఫున లోకసభ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జీ కుమార్ నాయక్ కోరారు. సోమవారం రాయచూరు రూరల్ శాసనసభ నియోజక వర్గం పరిధిలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు, బ్లాక్ కాంగ్రెస్ ప్రతినిధులతో గాణదాళ వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కుమార్ నాయక్ ప్రభుత్వ ఉద్యోగిగా వివిధ హోదాల్లో సేవలందించిన తనకు ప్రజాసేవకుడిగా పని చేసే అవకాశం కాంగ్రెస్ పార్టీ కల్పించిందన్నారు. జిల్లా ప్రజలు తనకు అండగా నిలిచి ఒక అవకాశం కల్పిస్తే ప్రజల గొంతుకగా పార్లమెంట్‌లో ఇక్కడి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. సమావేశంలో మాట్లాడిన రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడ కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కాంగ్రెస్ అభ్యర్థికి భారీ మెజార్టీని కట్టబెట్టాలని కోరారు.

హంపికి తగ్గిన పర్యాటకులు



నిర్మానుష్యంగా మారిన హంపీ విరుపాక్షేశ్వరాలయం

కంప్లి, ఏప్రిల్ 1 : దక్షిణ కాశీగా పేరుపొందిన హంపి పుణ్యక్షేత్రంలో పర్యాటకులు తగ్గుముఖం పట్టారు. రోజురోజుకు ఎండలు పెరుగుతుండటంతో ఇతర ప్రాంతాల నుంచి పర్యాటకులు వచ్చేందుకు వెనుకంజ వేస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే విరుపాక్షేశ్వర స్వామి దేవస్థానం, నవమిదిబ్బ, విజయవిఠల దేవస్థానం, పుష్కరిణి, గజశాల, నదీతీరాన కొంత వరకు భక్తులు కనిపిస్తున్నారు. పర్యాటకులు ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే పూజలు చేయించుకుంటున్నారు. మళ్లీ వాతావరణం చల్లబడేంతవరకు హంపికి పర్యాటకుల రాక అంతంత మాత్రంగానే ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. మొత్తానికి ఈ ఎండల్లో పర్యాటకుల సందడి తగ్గిపోయింది.

కళాకారులకు పుట్టినిల్లు నాటక రంగం



సత్కారాలతో కళాకారులు

బళ్లారి సిటీ,ఏప్రిల్ 1: ప్రపంచ నాటకరంగం కళాకారులకు పుట్టినిల్లు అని కర్ణాటక హిస్టరీ అకాడమీ జిల్లా అధ్యక్షుడు టీహెచ్‌ఎం బసవరాజు అభిప్రాయపడ్డారు. నగరంలోని డీఆర్‌కే రంగమందిరంలో ఆదివారం సాయంత్రం ప్రపంచ రంగస్థల దినోత్సవంలో భాగంగా నిర్వహించిన 'కళాకలరవ' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బళ్లారి జిల్లాలో ఉన్నంత మంది కళాకారులు, కళారూపాలు రాష్ట్రంలో ఏజిల్లాలో లేవని, అనేక కళారూపాలు ఇక్కడే పుట్టి పెరిగాయన్నారు. అయితే ఈ ఏడాది బళ్లారి జిల్లాకు రాజ్యోత్సవ అవార్డు రాకపోవడమే గాకుండా అకాడమీల అధ్యక్షులు, సభ్యుల నియామకాల్లో అన్యాయం జరిగిందన్నారు. బళ్లారి ఉత్సవం, రంగమందిర మరమ్మతు పనులు చేపట్టకపోవడం విచారకరమన్నారు. ఏడాది గడిచినా కళాకారులకు ఆర్థిక సాయం అందడంలేదన్నారు. కళాకారుల మధ్య ఐకమత్యం లేకపోవడమే మన జిల్లా దౌర్భాగ్యమని వాపోయారు. మన జిల్లా అన్నిరంగాల్లో నిర్లక్ష్యానికి గురైందని, అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈసందర్భంగా రంగస్థల ప్రాముఖ్యతపై వీరేశ్ స్వామి, దస్తగిరిసాబ్ ఉపన్యసించారు. చారులత శ్రీనిధి కళా ట్రస్ట్ వారిచే బృంద నృత్యం, హర్షిత్ వారిచే భరతనాట్యం, వీణా నూపుర కళాట్రస్ట్ వారిచే బాలల శాస్త్రీయ నృత్యం ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాకారులందరిని అవార్డులతో సత్కరించారు. ఈసందర్భంగా ఖాసీంసాబు, విరుపాక్షప్ప, దక్షిణామూర్తి, జగదీశ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నివారణ ఇంజెక్షన్లు



పశువులకు ఇంజెక్షన్లు వేస్తున్న వైద్యులు

కంప్లి, ఏప్రిల్ 1 : గ్రామాల్లో పశువులకు వైరస్ వ్యాపించడంతో కంప్లి పరిధిలోని పలు గ్రామాల్లో పశువైద్యాధికారులు రోగనిరోధక శక్తి పెరిగేందుకు ఇంజెక్షన్లు వేస్తున్నారు. సోమవారం డాక్టర్ బసవరాజు, ప్రదీప్ కాలుబాయి వైరస్ సోకిన పశువులకు ఇంజెక్షన్లు ఇచ్చారు. పశువుల కాపరులు పశువులకు వైరస్ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పశువులు జబ్బుల బారిన పడిన వెంటనే పశువైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో శివప్ప, దేవకి, రామచంద్ర, కోలప్ప, బళ్లారి మహదేవప్ప తదితరులు పాల్గొన్నారు.

రెండు కిలోల గంజాయి స్వాధీనం

కంప్లి, ఏప్రిల్ 1 : విజయనగర జిల్లా హూవిన అడగలి తాలుకా వద్ద హిరేహడగలి పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఉపనాయకనహళ్లి క్రాస్ వద్ద అనుమానాస్పదంగా వెళుతున్న వాహనాన్ని పోలీసులు తనిఖీ చేయగా అందులో 2.172 కిలోల గంజాయి పట్టుబడింది. దీని విలువ సుమారు రూ. 2 లక్షలు వరకు వుంటుందని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకున్నట్లు హిరేహడలిగి పోలీసులు తెలిపారు.

హోసూరు జోన్

వృద్ధ దంపతులకు కనకాభిషేకం



వృద్ధదంపతులకు కనకాభిషేకం చేస్తున్న పిల్లలు, మనవలు, మనవరాళ్ళు

హోసూరు ఏప్రిల్ 1: తల్లిదండ్రులను గౌరవించడమే కష్టంగా మారిన రోజులివి. అలాంటి సమయంలో తమకు జన్మనిచ్చిన పండుముసలివారైన తల్లిదండ్రులకు కనకాభిషేకం చేశారు హోసూరు వాసులు. హోసూరు పక్కన ఆవలపల్లి ప్రాంతానికి చెందిన ఓ వృద్ధదంపతులకు వారి సంతానం సోమవారం కనకాభిషేకం చేశారు. డీఎంకే హోసూరు యూనియన్ కార్యదర్శి గజేంద్రమూర్తి తండ్రి రంగప్ప(102)తల్లి ఎర్రమ్మ(92)లకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరికి ఇప్పుడు నాలుగు తరాలకు చెందిన 35 మంది మనవలు, మనవరాళ్లు ఉన్నారు. వారంతా కలసి సోమవారం ఆ వృద్ధదంపతులకు కనకాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వేద మంత్రోచ్చారణల మధ్య వృద్ధ దంపతులను కలశంలో తెచ్చిన బంగారు నాణేలతో కూడిన నీటితో అభిషేకించారు. వేలాది మంది బంధువులు, గ్రామస్థులు పాల్గొని వృద్ధ దంపతుల ఆశీస్సులు తీసుకుని భోజనాలు చేసి వెళ్లారు.

అద్దె ఇంటి కోసం వచ్చి వృద్ధురాలి హత్య



మృతి చెందిన సరళాదేవి

హోసూరు(క్రైం) ఏప్రిల్ 1: హోసూరు నేతాజీ రోడ్డు లోని నంజుండేశ్వరశెట్టి, అతని భార్య సరళాదేవి(67) జోస్ అలుకాస్ జ్యూవెలరీ షాపు సమీపంలో నివాసం ఉంటున్నారు. వారు నివసిస్తున్న ఇంటిలో ఒక పోర్షన్ అద్దెకు ఉన్నట్లు ఇటీవల టూలెట్ బోర్డు తగిలించారు. దీనిని గమనించిన ఓ జంట రెండు రోజుల క్రితం ఇల్లు అద్దెకు కావాలని అడిగి వెళ్లిపోయారు. మళ్లీ సోమవారం వచ్చి ఇంటిని ఓ సారి చూపించమని అడిగారు. సరళాదేవి ఇల్లంతా తిరిగి చూపిస్తున్న సమయంలో ఆ దంపతులు సరళాదేవి నోటిలో గుడ్డలు కుక్కి ఆమె మెడలోని 5 తులాల గొలుసు తీసుకుని పరారయ్యారు. సరళాదేవి స్పృహ తప్పి పడిపోయింది. ఆమె ఎంత సేపటికి బయటికి రాకపోవడాన్ని గమనించిన చుట్టుప్రక్కల వారు అక్కడికి వెళ్లి చూసే సరికి ఆమె స్పృహ కోల్పోయి ఉంది. ఆమెను చికిత్స కోసం ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు సరళాదేవి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హోసూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న హోసూరు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటన హోసూరులో కలకలం రేపింది.

భక్తిశ్రద్ధలతో విద్యార్థుల సరస్వతీ పూజ

హోసూరు ఏప్రిల్ 1 : మడివాళం ప్రభుత్వ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో సోమవారం సరస్వతి పూజ నిర్వహించి పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలని ప్రార్థించి విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టారు. హోసూరులో ప్రభుత్వ ఆంగ్ల మాధ్యమ ప్రాథమిక పాఠశాల నడుస్తోంది. కృష్ణగిరి జిల్లాలో 300 మందికి పైగా విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. సోమవారం పరీక్షలు ప్రారంభం కానున్నందున విద్యార్థులు అధిక మార్కులు సాధించి 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని పాఠశాలలో సరస్వతి పూజ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు కుమార్, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య బృందం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సరస్వతి పూజలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఎన్నికల్లో యువ ఓటర్లదే కీలక పాత్ర

● జిల్లా అధికారి చంద్రశేఖర్ నాయక్



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీసీ చంద్రశేఖర్ నాయక్

రాయచూరు, ఏప్రిల్ 1 : పార్లమెంటరి ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటింగ్‌కు అత్యంత ప్రాముఖ్యత ఉంటుందని జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ అన్నారు. ప్రజా ప్రభుత్వాల ఏర్పాటులో యువ ఓటర్లే కీలక భూమిక పోషిస్తారని గుర్తు చేశారు.

సోమవారం నగరంలోని వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఓటింగ్ జాగృతి కార్యక్రమంలో పాల్గొన్న జిల్లాధికారి యువకులనుద్దేశించి మాట్లాడారు. యువకులు తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలన్నారు. తొలుత తమ పేర్లు ఓటర్ల జాబితాలో ఉన్నాయో లేదో చూసుకోవాలని లేనిపక్షంలో సంబంధిత ఫారం ద్వారా తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలన్నారు. తాము ఓటు వేయడంతో పాటు ఇతరులకు సహితం ఓటు హక్కుకు ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్న ప్రాధాన్యతం గురించి వారికి వివరించి ఓటు వేసేలా చూడాలన్నారు.

14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని ఘనంగా జరపాలి

రాయచూరు, ఏప్రిల్ 1 : ఈ నెలలో నిర్వహించే మహనీయుల జయంతి కార్యక్రమాలను ఘనంగా ఎలాంటి ఇబ్బందులకు తావు లేకుండా నిర్వహించుకోవాలని జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ సూచించారు. ఈ నెల 5న క్రాంతి హరిత విప్లవకారుడు బాబు జగ్జీవన్ రామ్, ఈ నెల 14న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ల జయంతి కార్యక్రమాల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. అదే సమయంలో లోకసభ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా మహనీయుల జయంతిని అర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. వారి జయంతులను నిర్వహించడం ద్వారా యువతకు స్ఫూర్తి కలిగించాలన్నారు.

లక్ష్య సాధనలో అబ్కారీ శాఖ విఫలం

▸▸ ఆరేళ్లలో ఇదే ప్రథమం


బెంగళూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఖజానాకు ప్రధానమైన వనరుగా ఉండే అబ్కారీశాఖ లక్ష్యాన్ని సాధించడంలో విఫలమైంది. ఆరేళ్లతో పోలిస్తే ఇదే తొలిసారి టార్గెట్‌ను అధిగమించలేకపోయింది. రాష్ట్ర ఖజానాకు నిరంతరంగా ప్రధాన ఆదాయం అబ్కారీశాఖ ద్వారా సమకూరుతోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో దేశీయ మద్యం, బీర్‌లు పన్నులతోపాటు జరిమానాలతో కలిపి టార్గెట్ అందుకోలేకపోయారు. 720లక్షల బాక్సుల మద్యం విక్ర యించాల్సి ఉండగా 700 లక్షల బాక్సులు మాత్రమే విక్రయించారు. బడ్జెట్‌లో అబ్కారీశాఖ ద్వారా 36వేల కోట్ల రూపాయలు వార్షిక ఆదాయం లక్ష్యంగా పెట్టుకున్నారు. అబ్కారీశాఖ ముందస్తుగానే అంతమేర ఆదాయం సాధ్యం కాదని సవరించాల్సిన అవసరం ఉందని విన్నవించిన మేరకు ఆర్థిక సంవత్సరం లోపుగా 34,500 కోట్ల రూపాయలు లక్ష్యాన్ని నిర్ణయించారు. ఆర్థిక సంవత్సరం ఆదివారంతో ముగిసిన మేరకు 34,200 కోట్ల రూపాయల మేర అన్ని విధాలా ఆదాయం సమకూరింది. దీన్నిబట్టి 300 కోట్ల రూపాయల లోటు ఏర్పడింది. 2018-19 ఆర్థిక సంవత్సరం నుంచి అబ్కారీ ఆదాయం వివరాలిలా ఉన్నాయి.

మద్యం ఆదాయం	2018-19	2019-20	202-21	2021-22	2022-23
దేశీయ లిక్కర్	16,894.83	17,899.01	20,217.80	22,899.10	24,663.85
బీర్	2396.29	3018.90	2438.16	2757.30	4460.60
ఎక్సైజ్ డ్యూటీ	616.77	620.89	643.87	684.10	745.84
ఇతర విధాలు	36.04	45.15	32.27	37.18	50.08
మొత్తం	19,943.93	21,583.95	23,332.10	26,377.68	29,920.37

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

బడే గులామ్ అలీఖాన్ (జయంతి)



ప్రపంచ ప్రఖ్యాత హిందుస్తానీ సంగీత విద్వాంసుడు బడే గులామ్ అలీఖాన్ 1902 ఏప్రిల్ 2న అప్పటి పంజాబ్ ప్రావిన్స్ పరిధిలోని కాసూర్‌లో జన్మించారు. ఐదేళ్ల ప్రాయంలోనే గాత్ర సంగీతంలో అభిరుచిని ప్రదర్శించిన బడే గులాం క్రమేణా గొప్పస్థాయికి ఎదిగి 20వ శతాబ్దపు తాన్‌సేన్‌గా గుర్తింపు పొందారు. పాటియాలా - కాసూర్ ఘరానా, ధ్రుపద్, గ్వాలియర్ శైలి సంగీతంలో ఆయన ప్రాచుర్యం పొందారు. 'పద్మ భూషణ్', సంగీత నాటక అకాడమీ తదితర అత్యున్నత పురస్కారాలు అందుకున్నారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్యాలెస్‌లో 1968 ఏప్రిల్ 25న కన్నుమూశారు.

నామగిరిపెట్టై కృష్ణన్ (జయంతి)



నాదస్వర చక్రవర్తిగా పేరొందిన కర్ణాటక సంగీత విద్వాంసుడు నామగిరిపెట్టై కే కృష్ణన్ 1924 ఏప్రిల్ 2న తమిళనాడు రాష్ట్రం నామక్కల్ జిల్లాలోని నామగిరి పెట్టై గ్రామంలో జన్మించారు. నాదస్వర వాదనలో ఖ్యాతి గడించారు. దేశవిదేశాల్లో ఎన్నో ప్రదర్శనలు ఇచ్చారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో ఆస్థాన సంగీత విద్వాంసుడిగా సేవలందించారు. 1981లో పద్మశ్రీ పురస్కారం, ఇంకా తమిళనాడు ప్రభుత్వంచే కళామామణి బిరుదు, సంగీత నాటక అకాడమీ అవార్డు, ఇసై పెరారిగ్నర్ తదితర గౌరవాలు అందుకున్నారు. 2001 ఏప్రిల్ 30న కన్నుమూశారు.

యద్దనపూడి సులోచనారాణి (జయంతి)



ప్రముఖ తెలుగు నవలా రచయిత్రి యద్దనపూడి సులోచనా రాణి 1940 ఏప్రిల్ 2న కృష్ణా జిల్లా మొవ్వ మండలం కాజ గ్రామంలో జన్మించారు. ఆలుమగల మధ్య ప్రేమలు, కుటుంబ కథనాలు రాయడంలో తనకు వేరెవరూ సాటిరారని ఆమె నిరూపించారు. 'చిత్ర నళినీయం' అనే కథతో తన సాహితీ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆమె ఐదు దశాబ్దాల కాలంలో దాదాపు 80 నవలలు రచించారు. ఉత్తమ కథా రచయిత్రిగా నంది అవార్డు అందుకున్నారు. సెక్రటరీ, మీనా, జీవన తరంగాలు, జై జవాన్, ఆత్మగౌరవం వంటి నవలలు సినిమాలు, టీవీ సీరియళ్ళుగా వచ్చాయి. 2015లో హంస పురస్కారాన్ని అందుకున్నారు. 2018 మే 18న గుండెపోటుకు గురై కన్నుమూశారు.

అజయ్ దేవగన్ (పుట్టినరోజు)



బాలీవుడ్‌లో అజయ్ దేవగన్‌గా ఖ్యాతి పొందిన విశాల్ వీరు దేవగన్ 1969 ఏప్రిల్ 2న న్యూఢిల్లీలో పంజాబీ కుటుంబంలో జన్మించారు. నటుడిగానూ, నిర్మాతగానూ, దర్శకుడిగా పేరొం దారు. పలు బాలీవుడ్ హిట్ సినిమాల్లో ఆయన నటించారు. రెండు జాతీయ అవార్డులు సహా 32 అవార్డులను తన ఖాతాలో వేసుకున్నారు. ఇందులో మూడు ఫిలింఫేర్, జన్రత్ అవార్డు, పద్మశ్రీ తదితర పురస్కారాలు ఉన్నాయి. 2000లో తన సొంత బ్యానర్ అజయ్ దిగ్విజయ్ ఫిలింస్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఫూల్ ఔర్ కాంటే, దీవాంగీ, ఖాకీ, కాళ్, వన్స్ అపాన్‌ఏ టైమ్ ఇన్ ముంబై, సింగం, తన్హాజీ సినిమాలు ఎంతో గుర్తింపు ఇచ్చాయి.

ఘనంగా శివకుమారస్వామిజీ జయంతి

శిడ్లఘట్ట, ఏప్రిల్ 1: నడిచే దేవుడిగా కొనియాడబడిన త్రివిధ దాసోహి సిద్ధంగంగామఠాధిపతి శివకుమారస్వామిజీ జయంతిని సోమవారం పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. వివిధసంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో శివకుమారస్వామిజీ చిత్రటానికి పుష్పాంజలి ఘటించారు. దశాబ్దాలపాటు విద్య, వసతి, ఆహారం ఉచితంగా సమకూర్చడం ద్వారా సమాజానికి గొప్ప సేవలందించారని వక్తలు కొనియాడారు. నగరేశ్వరస్వామి ఆలయంలోనూ, ఇతర ఆలయాలలోనూ స్వామిజీ పేరిట విశేషపూజలు నిర్వహించారు.



జయంతిలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు తదితరులు

తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ..

బంగారపేట, ఏప్రిల్ 1: త్రివిధ దాసోహి, నడియాడే దేవుడిగా కొనియాడబడిన తుమకూరు సిద్దగంగా మఠాధిపతి డాక్టర్ శివకుమారస్వామిజీ 117వ జయంతిని ఆచరించడం మనందరి భాగ్యమని పురసభ మాజీ సభ్యుడు బీసీ మూర్తి పేర్కొన్నారు. సోమవారం ఉదయం 11.30గంటలకు సిద్ధగంగామఠం పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో స్వామిజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అన్నసంతర్పణ అనంతరం ఆయన మాట్లాడుతూ ఆకలిగొన్నవారికి అన్నంతోపాటు విద్య, వసతి కల్పించి వేలాదిమంది పిల్లల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. విద్య యొక్క ప్రాధాన్యతను స్వామిజీ తెలియచేశారన్నారు. విద్యకు దూరం కారాదనే సదుద్దేశ్యంతో మఠంలో చేర్పించుకుని అన్నంతోపాటు అక్షర, వసతి కల్పించారన్నారు. కార్యక్రమంలో పురసభ సభ్యుడు వెంకటేశ్, గోవింద, ప్రముఖులు శాంతినగర్ కిట్టణ్ణ, రంగప్ప, జీవన్, రవికుమార్, శ్రీధర్, కేశవ, ఉమేశ్, సింగ్, షబ్బీర్, వినోద్, మున్నారాయణ

విజయపురలో...

విజయపుర, ఏప్రిల్ 1: సమాజంలో మార్పు తెచ్చేందుకు ఎంతో కృషి చేసినవారిలో తుమకూరు సిద్దగంగా మఠాధిపతి శివకుమారస్వామిజీ ఒకరని పురసభ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత సభ్యుడు ఎం సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలో సోమవారం స్వామిజీ జయంతి నిర్వహించారు. స్థానిక గాంధీచౌక్‌లోని మహంతి మఠం, నగర్త యువజన సంఘం, నగర్త మహిళా సంఘం, నగరేశ్వరస్వామి రథోత్సవం సమితి, ఇతర అనుబంధ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో స్వామిజీ జయంతి సాగింది. సతీశ్‌కుమార్ మాట్లాడుతూ ఏప్రిల్ 1న ఇదివరకు మూర్ఖుల దినోత్సవంగా ఆచరించేవారని, ప్రస్తుతం దాసోహ దినోత్సవంగా ఆచరించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మహంతి మఠం అధ్యక్షుడు పునీత్‌కుమార్, కార్యదర్శి విశ్వనాథ్, మధు, డైరెక్టర్ సీ విజయరాజ్, నళిని శాంతకుమార్, బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.



శివకుమారస్వామిజీ చిత్రపటానికి పుష్పాంజలి



అన్నదానం నిర్వహిస్తున్న సభ్యులు

మూగజీవాల కోసం తొట్టెల్లో నీరు

బంగారపేట, ఏప్రిల్ 1: వేసవి ప్రారంభంలోనే ఎండ వేడిమి అధికంగా ఉంది. దీంతో ప్రజలే కాకుండా పశుపక్ష్యాదులు సైతం దాహార్తికోసం పరితపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కర్ణాటక సింహఘర్జన వేదికె రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్‌స్వామి, ఏకాభిప్రాయం కల్గిన మిత్రబృందంతో కలసి నీరు కల్పించేందుకు సిద్ధమయ్యారు. తాలూకాలో ఈసారి ఆశించిన మేరకు వర్షాలు కురవకపోవడంతో కుంటలు ఎండిపోతున్నాయి. తాలూకాలోని దొడ్డరు కరపనహళ్ళి పరిధిలోని కొండగుట్టల ప్రదేశాలలో తొట్టెలు ఏర్పాటు చేసి ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతున్నారు. ఇక్కడి కొండగుట్ట ప్రాంతాలలో జింకలు, నెమలులు, కుందేళ్ల సంచారం అధికంగా ఉంది. ప్రసన్నకుమారస్వామి మాట్లాడుతూ చెరువులు, కుంటలు ఎండిపోవడంతో తాత్కాలిక సిమెంట్ తొట్టెలను నిర్మించి నీటిని సమకూరుస్తున్నామన్నారు. రెండు రోజులుగా కార్యాచరణ కొనసాగిస్తున్నామన్నారు.



తొట్టెలలో నీరు నింపుతున్న కర్ణాటక సింహఘర్జన వేదికె సభ్యులు

ఓటు హక్కుపై వినూత్న చైతన్యం



కొవ్వొత్తులతో ర్యాలీ

బాగేపల్లి, ఏప్రిల్ 1: లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్‌శాతం పెంచేందుకు స్వీప్ కమిటీలు వినూత్న కార్యక్రమాలు కొనసాగిస్తున్నాయి. పురసభ, జిల్లా స్వీప్ సమితి సంయుక్తంగా సోమవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించాయి. బాగేపల్లి శాసనసభ నియోజకవర్గ ఎన్నికల అధికారి సంతోష్‌కుమార్ పాటిల్, తహసీల్దార్ ప్రశాంత్ కే పాటిల్, పురసభ ముఖ్య అధికారి శ్రీనివాస్ నేతృత్వంలో ర్యాలీని ప్రారంభించారు. ఎన్నికల అధికారి సంతోష్‌పాటిల్ మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా ఓటు వేయాలన్నారు. తహసీల్దారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధమైన ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ర్యాలీలో గుడిబండ తహసీల్దారు మనీషా, ఈఓ హేమావతి, పురసభ ముఖ్యాధికారి శ్రీనివాస్ వివిధశాఖల అధికారులు, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భారత ఖ్యాతి ప్రధాని మోదీతోనే..

మహదేవపుర, ఏప్రిల్ 1: భారతదేశ ప్రతిష్ఠ విదేశాల్లోనూ ఇనుమడించేందుకు ప్రధాని నరేంద్రమోదీ పాలనా వైఖరియే కారణమని మాజీ మంత్రి అరవింద లింబావళి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని వైట్‌ఫీల్డ్‌లోని హోప్ ఫాం వద్ద సోమవారం ఏర్పాటైన కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. దేశ సమగ్ర అభివృద్ధిలో ప్రధాని మోదీ పాత్ర కీలకమన్నారు. గత 65ఏళ్ల సాధన ఒక ఎత్తు అయితే పదేళ్ల మోదీ పాలన, సాధన మరొక ఎత్తు అన్నారు. దేశం కోసం నిరంతరం శ్రమించే ప్రధాని మోదీ అన్ని రంగాలలో స్వావలంబన సాధించారన్నారు. ఉన్నతమైన రహదారులు, హైటెక్ విమానాలు, మెట్రో సేవలు, బ్యాంకు సేవలు, వ్యవసాయం, పాడిరంగం ఇలా అన్ని విభాగాల్లోనూ ప్రగతి సాధించారన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు శ్రమించాలన్నారు. సమావేశంలో బీజేపీ అభ్యర్థి పీసీ మోహన్, పార్టీ రాష్ట్ర సంఘటనా కార్యదర్శి రాజేశ్, సుధాకరరెడ్డి, మనోహర రెడ్డి, నటరాజ్, రాజేశ్, చన్నసంద్ర చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ మనోభావాలు పెంపొందించుకోవాలి



చర్చాగోష్ఠి ప్రారంభంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు

బాగేపల్లి, ఏప్రిల్ 1: విద్యార్థులు శాస్త్రీయ మనోభావాలు పెంపొందించుకోవడం ద్వారా వినూత్న ప్రయోగాలు, ఆవిష్కరణలు చేసి సమాజానికి చక్కటి సేవలు అందించాలని బీఆర్‌సీ ఆర్ వెంకటరామ్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని పీఎంశ్రీ స్కూల్‌లో సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య చర్చాగోష్ఠిని సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రముఖ విద్యావేత్త డాక్టర్ హెచ్ నరసింహయ్య అభిప్రాయం ప్రకారం జీవితంలో ప్రశ్నించనిదే దేనిని అంగీకరించరాదనేవారన్నారు. ఏ అంశమైనా ప్రశ్నించడం ద్వారా ఎక్కువ సమాధానం, వివరాలు లభిస్తాయన్నారు. చర్చాగోష్ఠిలో పలు అంశాలను ఉపాధ్యాయులు ప్రస్తావించారు. ఉత్తమ ఆలోచనలు, భావాలు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు కానుందన్నారు. జాతీయ పురస్కార గ్రహీత, హంపసంద్ర ప్రభుత్వ హైస్కూల్ టీచర్ హరీష్ రాజ్ అరసు ప్రసంగిస్తూ కేవలం పాఠాలకే పరిమితం కాకుండా ప్రాక్టికల్స్ చేయడం ద్వారా సైన్స్ మరింత సులభంగా అర్థం చేసుకోవచ్చునన్నారు. ప్రశ్నించడం ద్వారా కొత్త అంశాలు తెలుసుకోవచ్చునన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని ఆకాంక్షించారు. చర్చాగోష్ఠిలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి యులు వాహనం

బెంగళూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాలకు ఆదరణ పెరుగుతున్న తరుణంలో ఎలక్ట్రికల్ కంపెనీ యులు సరికొత్త ద్విచక్రవాహనాన్ని మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఈమేరకు నగరంలో ఒక ప్రకటనను సోమవారం విడుదల చేశారు. దేశవ్యాప్తంగా ఒకేసారి మార్కెట్‌లోకి వాహనాన్ని తీసుకొస్తున్నట్టు ప్రకటించారు. యులు స్థానిక మార్కెట్ పరిజ్ఞానం, సాంకేతికత, నిర్వహణా నైపుణ్యం, హార్డ్‌వేర్, బ్రాండ్‌లపై అనుభవం ఉన్న మేరకు అందుకు అనుగుణంగా రూపొందించినట్టు ప్రతినిధులు ప్రకటించారు. ఏఐ, ఎల్‌ఓటీ ప్లాట్‌ఫాం ద్వారా వాహనాన్ని తీసుకొస్తున్నారు. ఎలక్ట్రిక్ వాహనాలు సర్వత్రా వాడేవారి సంఖ్య పెరుగుతున్న తరుణంలో కొత్త వాహనాన్ని విడుదల చేసినట్టు ప్రకటించారు. బెంగళూరుతోపాటు ముంబై, ఢిల్లీ నగరాలలోనూ అందుబాటులో ఉందన్నారు.

స్టాండప్ కామెడితో కేరింతలు

బెంగళూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పీఈఎస్ యూనివర్సిటీలో ఆత్మతృషలో భాగంగా స్టాండప్ కమెడియన్ నమిత్‌జైన్ ప్రదర్శనకు విద్యార్థులు కేరింతలు కొట్టారు. బిశ్వకల్యాణ్‌రాత్ ప్రదర్శన సుదీర్ఘసమయం సాగింది. బిశ్వ నాటకరంగం నుంచి పేరొంది స్టాండప్ కమెడియన్‌గా రాణిస్తున్నారు. అనంతరం డీజే మేనర్స్ రీమిక్స్‌లలో సంజయ్‌తారా షాన్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



నమిత్‌జైన్ హాస్యం

పింఛన్ల పంపిణీకి ప్రత్యేక ఏర్పాట్లు : ఎంపీడీఓ

గోరంట్ల, ఏప్రిల్ 1: మండలంలో బుధవారం నుంచి గ్రామ సచివాలయాల ద్వారా పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ ప్రవీణ్ తెలిపారు. ఆయన సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వ హించారు. ఈఓఆర్డీ సుధాకర్ పాల్గొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వెంటనే వలంటీర్ల వద్ద ఉన్న సెల్‌ఫోన్స్, డివైజులు, ఇతర రికార్డులు స్వాధీనం చేసుకోవాలని కార్యదర్శులకు ఆదేశించారు. పింఛన్ల పంపిణీని కార్యదర్శులు, సచి వాలయ సిబ్బంది సంయుక్తంగా పంపిణీచేసేలా ఉత్తర్వులు జారీ చేశామన్నారు. గ్రామాల్లోని రచ్చకట్టలు, ప్రధాన ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీ చేపట్టాలన్నారు. పంచాయతీల్లో 69శాతం పన్నులు వసూలు చేశామని ఈఓఆర్డీ తెలిపారు. గోరంట్లలో నేటికీ పార్టీల జెండాలు, ప్రచార సామాగ్రి కనిపిస్తుండడంతో సీ విజిల్ యాప్ ద్వారా ఏడు ఫిర్యాదులు అందిన ట్లు ఎంపీడీఓ తెలిపారు. ఇకపై ప్రజల ఫిర్యాదులు అందకముందే చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ వద్ద, గ్రామ ప్రధాన ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈసమావేశంలో పంచాయతీ కార్యదర్శులున్నారు.

ఆప్ నాయకుడి మృతికి నివాళి

పావగడ, ఏప్రిల్ 1:
తమటే సంస్థ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకుడు కన్నమేడి గంగరాజు(42) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. ఇటు సంస్థలోనూ, అటు పార్టీ కార్యక్రమాల్లో ఎంతో చురుకుగా పనిచేసేవారని తమటే సంస్థ తాలూకా అధ్యక్షుడు వెంకటేష్ పేర్కొన్నారు. గంగరాజు మృతి పార్టీకి, సంస్థకు తీరనిలోటన్నారు. బౌద్ధ సమాజం నాయకుడు పళవల్లి సుబ్బరాజు, ఆప్ నాయకులు గోపాల్, పవన్ తదితరులు కన్నమేడికి వెళ్లి సంతాపం వ్యక్తం చేశారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నట్లు బంధువులు తెలిపారు.

కోనేరును పునరుద్ధరిస్తాం

- పరిపూర్ణానందస్వామి

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 1: హిందూపురంలో గణేశ్ నిమజ్జనం కోసం కోనేరును పునరుద్ధరిస్తామని శ్రీ పీఠం పీఠాధిపతి పరిపూర్ణానందస్వామి పేర్కొన్నారు. ఆయన సోమవారం స్థానిక గుడ్డం ఆలయం వద్ద విలేకరుల సమావేంలో మాట్లాడారు. గణేశ్ నిమజ్జనానికి తగ్గట్టుగా ఇక్కడి కోనేరును ఏర్పాటు చేయాలని 43 ఏళ్లుగా ప్రజలు ప్రభుత్వాలు పట్టించుకోలే దన్నారు. ఈ సారి ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కోనేరును అభివృద్ధి చేయాలన్నారు. పురం అభివృద్ధికి సప్తపది అనే కార్యక్రమంలో భాగంగా (ఏడు అంశాలతో) ప్రణాళిక రూపొందించా న్నారు. ఇందులో బాగంగా ముందు కోనేరును పునరుద్ధరించాలన్నారు. లేని పక్షంలో దేశ విదేశాల్లో ఉన్న తన భక్తుల సహకారంతో నిర్మిస్తానన్నారు. ఇందులో భాగంగా సోమవారం కోనేరుకు పూజ చేశారు.

దరఖాస్తులకు అవకాశం

బెంగళూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బీపీఎల్ కార్డుల ప్రాధాన్యత పెరిగింది. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకున్న కార్డుల పరిశీలన వేగవంతం చేయదలిచారు. సోమవారం నుంచి కొత్తగా రేషన్ కార్డులకోసం దరఖాస్తు చేసుకునేందుకు వెసలుబాటు కల్పించినట్టు పౌర ఆహార సరఫరాలశాఖ ప్రకటించింది. ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్న 2,95,986 అర్జీలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. అత్యవసర వైద్య చికిత్సలకోసం అర్హత కల్గినవారికి 744 కార్డులను మంజూరు చేశారు. రేషన్‌కార్డు దరఖాస్తు చేసుకోదలిచినవారు కర్ణాటకలో స్థిర నివాసం కలిగి ఉండాలి. ఇప్పటివరకు ఏ ప్రాంతంలోనూ రేషన్‌కార్డు కలిగి ఉండరాదు. కొత్తగా పెళ్లి చేసుకున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. కుటుంబ ఆదాయం ఆధారంగా ఎటువంటి రేషన్‌కార్డు ఇవ్వాలనేది నిర్ణయిస్తారు. దరఖాస్తుదారులు ఓటరు గుర్తింపుకార్డు, ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు ఇటీవల తీసుకున్న రెండు ఫోటోలు, మొబైల్ నెంబరుతోపాటు సొంత ధ్రువీకరణ సమర్పించాల్సి ఉంటుంది.

యడియూరప్పకు గుణపాఠం చెబుతా

▸▸ కుటుంబ రాజకీయాలపై పోరాటం చేస్తా

▸▸ మాజీ మంత్రి ఈశ్వరప్ప

బెంగళూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎంతోకాలం నుంచి ఓపిక పడుతూ వచ్చానని రాష్ట్ర బీజేపీలో కుటుంబ రాజకీయాలను తుదముట్టించేదాకా పోరాటం చేస్తానని, ప్రత్యేకించి యడియూరప్ప కుటుంబ రాజకీయాలకు తగిన గుణపాఠం చెబుతానని మాజీ మంత్రి ఈశ్వరప్ప తేల్చి చెప్పారు. ఉడుపి జిల్లా బైందూరులో ఆదివారం హిందూ సంఘాల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హిందుత్వం కోసం ప్రాణాలిచ్చేందుకు వెనుకాడని కార్యకర్తలకు, హిందూ కార్యకర్తలకు బీజేపీ నిరంతరంగా మోసం చేస్తోందన్నారు. యడియూరప్ప ఒప్పందపు రాజకీయాల ద్వారా తన కుటుంబ రక్షణలో ఉన్నారన్నారు. రాష్ట్ర బీజేపీలో యడియూరప్ప ఏ స్థాయిలో పనిచేశారో, అదేస్థాయిలో తానూ పనిచేశాననేది కార్యకర్తలందరికీ తెలుసు అన్నారు. కేవలం తన స్వార్థం కోసం కుటుంబ రాజకీయాలను చేసుకుంటూ వచ్చిన యడియూరప్పకు వ్యతిరేకంగా తన పోరాటం కొనసాగుతుందన్నారు. తాను ఎప్పుడూ ఒప్పందపు రాజకీయాలు చేయలేదన్నారు. హిందుత్వాన్ని ఊపిరిగా చేసుకుని రాజకీయాలు చేశానని తెలిపారు. నాయకుల ఒత్తిడికి తలొగ్గి సంగొళ్లి రాయణ్ణ బ్రిగేడ్ సంఘాన్ని వదులుకోవడం తాను చేసిన తొలి తప్పిదమన్నారు. హిందుత్వాన్ని అంగీకరించిన కార్యకర్తలు తనతో కలిసి ఉన్నారన్నారు. శివమొగ్గలో కనీసం లక్ష మెజారిటీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. బైందూరుకు చెందిన హిందూ ముఖ్యులు శ్రీధర్ బిజూరు, కొల్లూరు ఆలయ వ్యవస్థాపక కమిటీ మాజీ సభ్యులు గోపాలనాడ, సువర్ణ పూజారి, ఈశ్వరప్ప కుమారుడు కాంతేష్, యశవంత గంగొళ్లి, నారాయణగుజ్జాడితో పాటు పలువురు పాల్గొన్నారు.

నన్ను గెలిపిస్తే లోక్‌సభలో రాష్ట్రసమస్యలు ప్రస్తావిస్తా

- శ్యామనూరుకు గాయత్రి సిద్దేశ్వర్ సవాల్

బెంగళూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మాట్లాడడమే రాదు... ఆమెకెందుకు రాజకీయాలు, వంట చేసేందుకు సరిపోతారంటూ కాంగ్రెస్ సీనియర్ నేత శ్యామనూరు శివశంకరప్ప వ్యాఖ్యలకు దావణగెరె బీజేపీ అభ్యర్థి గాయత్రి సిద్దేశ్వర్ సవాల్ విసిరారు. నన్ను గెలిపిస్తే లోక్‌సభలో దావణగెరెతోపాటు రాష్ట్ర సమస్యలను ప్రస్తావిస్తానన్నారు. సోమవారం విద్యానగర పార్కు ప్రాంతంలో ఇంటింటా ప్రచారం చేశారు. ఇదే సందర్భంలో మీడియాతో మాట్లాడుతూ నన్ను గెలిపిస్తే వంట చేయడమే కాదు లోక్‌సభలో కూర్చుని అభివృద్ధి గురించి మాట్లాడతానన్నారు. మనం ఎవరినీ తక్కువ చేసి మాట్లాడరాదని, ప్రతి ఒక్కరిలోనూ శక్తిసామర్థ్యాలు ఉంటాయన్నారు. ఒణకె ఓబవ్వ, కిత్తూరు రాణి చెన్నమ్మ వంటి ఎంతోమంది మహిళల సాధనలు శతాబ్దాల ముగుస్తున్నా చర్చించుకుంటున్నామన్నారు.

మీడియాతో కలసి ప్రచారం కోసమే సుధాకర్ వచ్చారు

బెంగళూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): చిక్కబళ్ళాపుర అభ్యర్థి డాక్టర్ సుధాకర్ కేవలం ప్రచారం కోసమే మీడియాతో కలసి మా ఇంటికి వచ్చారని యలహంక ఎమ్మెల్యే విశ్వనాథ్ ఆరోపించారు. సోమవారం బెంగళూరులో విశ్వనాథ్ మీడియాతో మాట్లాడుతూ అభ్యర్థి సుధాకర్ సింపతీ కోసమే ఆదివారం మా ఇంటికి మీడి యాతోపాటు వచ్చారన్నారు. సుధాకర్ వచ్చే విషయం నాకు సమాచారం లేదన్నారు. నేను బయటకు వెళ్లానన్నారు. ఇదే సమయంలోనే సుధాకర్ వచ్చారని సెక్యూరిటీతో అడిగిన మేరకు వారు ఎమ్మెల్యే లేరని వాస్తవమే చెప్పారన్నారు. అయితే సుధాకర్ భిన్నంగా మాట్లాడారన్నారు. నా కుమారుడికి టిక్కెట్ దొరకనందుకు అసంతృప్తి ఉందన్నారు. సుధాకర్‌పై వ్యక్తిగత ద్వేషం లేదన్నారు. నాలుగైదురోజుల క్రితం కలుస్తానని మెసేజ్ చేశారన్నారు. ఆ తర్వాత సంప్రదించలేదన్నారు. సుధాకర్ వచ్చే విషయం తెలియకపోవడంతోనే నా సొంత పనులకు బయటకు వెళ్లానన్నారు. గేట్ తెరవలేదని, ఇంటి లోపలికి రానివ్వలేదనేది సరికాదన్నారు. సుధాకర్‌ను వీధిలో నిలిపేంతటి నీచమైన వ్యక్తిత్వం నాకు లేదన్నారు. ఆయన ఒక్కడే రావాల్సి ఉండేదని, మీడియాతో పాటు ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. కాగా ఇదే విషయమై డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ టిక్కెట్ కోసం ప్రయత్నాలు చేశామని, కొంత అసంతృప్తి ఉండవచ్చునని రెండు మూడు రోజుల్లో పరిష్కారం కానుందన్నారు. పార్టీ అగ్రనేత యడియూరప్ప, విజయేంద్రలు చర్చలు జరుపుతారన్నారు.

సౌదీలో మంగళూరు వాసి అరెస్టు

- విడుదలకోసం విదేశీ వ్యవహారాలశాఖ మంత్రికి కుటుంబీకుల లేఖ

బెంగళూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సౌదీ అరేబియాలో ఓ దుకాణం నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్న మంగళూరు జిల్లా వాసి మోసం కేసులో జైలు పాలయ్యాడు. ఆయనను విడుదల చేయించాలని కోరుతూ విదేశీ వ్యవ హారాలశాఖ మంత్రికి కుటుంబీకులు ఆదివారం లేఖ పంపుకున్నారు. ఉళ్లాల నియో జకవర్గం ఒంబత్తుకెరెకు చెందిన ఇస్మాయిల్ (65) గత 27ఏళ్లుగా సౌదీ అరేబియాలోనే నివసిస్తున్నాడు. పదేళ్లుగా రియాద్‌లో డ్రై క్లీనింగ్ షాప్‌ను నిర్వహిస్తున్నాడు. సౌదీలో నివసిస్తున్న కేరళ వాసులు ఇద్దరు, ఈజిప్ట్ దేశానికి చెందిన మరొకరి నుంచి ఇస్మాయిల్ అప్పు చేశాడు. సకాలంలో చెల్లించకపోవడంతో ఆర్థిక మోసానికి పాల్పడిన ఆరోపణలతో అక్కడి పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. ఇస్మాయిల్‌కు షుగర్, బీపీ ఉన్నాయని జైలులో ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారని మంత్రి రాసిన లేఖలో వివరించారు. వెంటనే ఇస్మాయిల్‌ను విడుదల చేయించే ప్రయత్నం చేయాలని మంత్రిని కోరారు.

ప్రైవేట్ విద్యాసంస్థల ప్రగతికి చేయూత

బెంగళూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ప్రైవేట్ విద్యాసంస్థల ప్రగతికి ఆర్థిక చేయూత ఇవ్వదలిచినట్టు ఇండియన్ స్కూల్ ఫైనాన్స్ కంపెనీ (ఐఎస్‌ఎఫ్‌సీ) సీఈఓ సందీప్ విర్క్‌హార్ ప్రకటించారు. బెంగళూరులో ఈమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వర్తనా ఫైనాన్స్ పేరిట ఆర్థిక లావాదేవీలు జరిపిన సంస్థ ఐఎస్‌ఎఫ్‌సీగా మార్పు చెందిందన్నారు. దేశ్యాప్తంగా 4లక్షలకుపైగా ప్రైవేట్ విద్యాసంస్థలు ఉన్నాయని, వీటిలో కనీస సదుపాయాలు లేని సంస్థలను గుర్తించి వాటి అభివృద్ధికోసం ఆర్థికంగా చేయూత ఇవ్వదలిచామన్నారు. దేశంలో 3.50కోట్లమంది యువతకు గుణాత్మకమైన విద్య అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అందుకే విద్యాసంస్థలలో మౌలిక సదుపాయాలు పెరగాలంటే ఆర్థికంగా బలోపేతం కీలకమన్నారు.

కనిపించకుండా పోయిన ఎన్నికల అధికారి... శవంగా గుర్తింపు

▸▸ దక్షిణకన్నడ జిల్లాలో ఘటన

బెంగళూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): దక్షిణకన్నడ జిల్లాలో ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తూ కనిపించకుండాపోయిన వ్యక్తి మృతదేహాన్ని ధర్మస్థళ సమీపంలో గుర్తించారు. జిల్లా పరిధిలోని అంటాడి గ్రామపంచాయతీ కార్యదర్శిగా వ్యవహరిస్తున్న లక్ష్మీనారాయణ ఎన్నికల విధులలో ఉన్నారు. మార్చి 27న విధి నిర్వహణలోకి వచ్చిన ఆయన అదే రోజు కనిపించకుండా పోయారు. కుటుంబ సభ్యులు పుంజలకట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విధులు ముగించుకుని బయటకు వచ్చిన ఆయన ఫోన్ కొద్దిసేపటికే స్విచ్ఛాఫ్ కావడంతో ఆయన తమ్ముడు అధికారులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే బంట్వాళ ఎన్నికల అధికారి పోలీసులతో గాలింపులకు ఆదేశించారు. బెళ్తంగడిలో ఆయన మోటర్‌సైకిల్‌ను గుర్తించారు. మార్చి 30వ తేదీ వరకు పత్రమ పరిధిలో ఆయన మొబైల్ సిగ్నల్ వాడినట్టు గుర్తించారు. చివరకు ఆదివారం సాయంత్రం ధర్మస్థళ సమీపంలోని కాలువలో లక్ష్మీనారాయణ మృతదేహాన్ని గుర్తించారు. అతడి వద్ద ఆధారాలను బట్టి కుటుంబీకులు తెలుసుకున్నారు. లక్ష్మీనారాయణ ఆత్మహత్యకు పాల్పడ్డాడా లేదా హతమార్చారా అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది.